# పదికి పది గెలవాలి

## లోకల్ బిడ్డ, అభివృద్ధిపై తపనున్నోడు క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ 23 రోజుల చిత్తశుద్ధితో పనిచేయాలి
- కాంగ్రెస్‌ను నమ్ముకుంటే రాష్ట్రాన్ని అమ్ముకుంటరు...
- కాంగ్రెసోళ్ల మాటలింటే మోసపోతం.. గోసపడ్డం..
- కాంగ్రెసులో కుర్చీల కోసం కొట్లాట...
- బీఆర్ఎస్‌లో అభివృద్ధి కోసం తండ్లాట..
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- అందోల్‌లో బూతుస్థాయి సమీక్షా సమావేశం

అందోల్, నవంబర్ 7: ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించటమే లక్ష్యమని, ఎన్నికల్లో పది స్థానాల్లో గెలుస్తామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం, జిల్లా అభివృద్ధి చెందిందని తెలిపారు. అందోలు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌ను కార్యకర్తలు, ఓటర్లు భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంత్రికిరణ్ స్థానికుడని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సేవచేస్తున్నారని తెలిపారు. అలాంటి నాయకుడిని మరోమారు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలు, నియోజకవర్గం బాగుపడుతుందన్నారు. ఇతర పార్టీ నేతలను గెలిపిస్తే వారు హైదరాబాద్‌కే పరిమితం అవుతారని తెలిపారు. అందోలు నియోజకవర్గంలో కాంత్రికిరణ్‌ను గెలిపిస్తామని బీఆర్ఎస్ బూతుస్థాయి ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

కాంగ్రెస్‌ను నమ్ముకుంటే రాష్ట్రాన్ని అమ్ముకుంటారని, అందుకు ప్రత్యక్ష సాక్ష్యం మన పక్కనే ఉన్నా కర్ణాటక రాష్ట్రం అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం అందోల్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ బూత్‌స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతితో కలిసి హాజరైన మంత్రి కాంగ్రెస్ అవినీతిని ఎండగట్టారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోలేదని రైతులకు కనీసం మూడు గంటల కరెంట్ సైతం అందించడం లేదన్నారు. అక్కడి ప్రభుత్వ పాలన చూసి విసుగు చెందిన రైతులు ఇక్కడికి వచ్చి వారికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని కర్ణాటక రాష్ట్ర ఉపముఖ్య మంత్రి స్వయంగా చెప్పినా, కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు ప్రచారం చేయడం ఆపడం లేదన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలబెట్టడానికి కృషి చేస్తుంటే ప్రతిపక్షాలు ప్రజలను ఆగం చేయాలని చూస్తున్నాయన్నారు. రైతుబంధు సృష్టికర్త కేసీఆర్ అని రైతుబంధు ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకం అమలు జరుగుతుందా అని గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను రైతులు ప్రశ్నించాలన్నారు. వచ్చేసారి రైతుబంధు రూ.16వేలు ఇస్తామని, పెన్షన్లు పెంచుతామని, గృహలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి ఇలా ఎన్నో గొప్పగొప్ప పథకాలు అమలు చేయనున్నామని ఇవన్నీ ప్రజలకు వివరించే బాధ్యత బూత్‌లెవల్ నాయకులపై ఉన్నదన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు


మాట్లాడుతున్న ఎంపీ బీబీపాటిల్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్


మాట్లాడుతున్న ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి

### అభివృద్ధిని వివరించి.. ఓట్లు అడగాలి

ప్రజలకు సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని వివరించి ప్రజలను ఓట్లు అడగాలన్నారు. అన్ని సర్వేలు మనం భారీ మెజార్టీతో గెలవనున్నామని చెబుతున్నాయని, ఇంతటితో సంబరపడిపోవద్దని జిల్లాలో పదికి పది స్థానాల్లో ఘన విజయం సాధించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. రూ.4వందలకే గ్యాస్ సిలిండర్, సౌభాగ్యలక్ష్మి ద్వారా మహిళల రూ.3వేలు, రేషన్‌కార్డున్న ప్రతిఒక్కరికీ 6 కిలోల సన్న బియ్యం ఇవ్వనున్నామని, రైతుబీమాలాగే ఒక్క రూపాయి ఖర్చులేకుండా రూ. 5 లక్షల బీమా ఇవ్వనున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి కొత్తగా ఒక్క అవకాశం ఇవ్వండి..? అభివృద్ధి చేస్తామంటున్నారు ఒక్కసారి కాదు 11సార్లు మీకే గెలిపించారు కదా..? ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఆ పార్టీది కుర్చీల కొట్లాట అని కానీ...బీఆర్ఎస్‌ది మాత్రం ప్రజల కోసం...వారి అభివృద్ధి కోసం తండ్లాటా అన్నారు. సద్దికట్టిన రేవును మరవొద్దు– అబద్ధాలు చెప్పే కాంగ్రెస్‌ను నమ్మి ఆగం కావొద్దని అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కే మళ్లీ పట్ట కట్టాలన్నారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి తాను అడిగిన వాళ్లకు టికెట్ ఇవ్వలేదని అలిగి ఉన్నాడాని... మరోపక్క పటాన్‌చెరువు టికెట్ రూ.100కోట్లకు అమ్ముకున్నారని అక్కడి నాయకులు నిరసనలు చేపడుతున్నారని..ఇలాంటి అమ్ముడుపోయే నాయకులు మనకొద్దు. లోకల్ బిడ్డ, మంచి మనిషి, అభివృద్ధిపై తపన ఉన్నోడు క్రాంతికిరణ్‌ను నిండు మనస్సుతో దీవించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని మంత్రి పిలుపునిచ్చారు. ఎంపీ బీబీ పాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి మాట్లాడుతూ లోకల్ వ్యక్తి, ప్రజలకు అందుబాటులో ఉండే స్థానిక అభ్యర్థి క్రాంతికిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అందోల్ అభ్యర్థి క్రాంతికిరణ్ మాట్లాడుతూ అందోల్ ప్రజలు ఐదేండ్లుగా గుండెల్లో పెట్టుకుని చూసుకున్నారన్నారు. వారు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని మరోసారి గెలిపిస్తే ప్రతి ఒక్కరికీ అండగా ఉండి సేవ చేసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి ఫరూఖ్‌హుస్సేన్, స్టేట్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాహుల్‌కిరణ్, జైపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పల్లె సంజీవయ్య, ఎంపీపీ బాలయ్య, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

## కార్యకర్తలకు అండగా ఉంటా..

**మంత్రి తన్నీరు హరీశ్‌రావు**

అందోల్, నవంబర్ 7: ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటూ మీ కష్టాల్లో పాలుపంచుకుంటానని మంత్రి హరీశ్ రావు కార్యకర్తలకు హామీనిచ్చారు. మళ్లీ రాబోయేది మన ప్రభుత్వమేనని అప్పుడు అందరికీ సముచిత స్థానం దక్కుతుందని చిన్నచిన్న విషయాలకు అలకబూని పార్టీకీ దూరంగా ఉండొద్దన్నారు. ప్రభుత్వం ఎన్నో మంచి పనులు చేస్తున్నదని..ప్రతీ పథకం నేరుగా లబ్ధిదారులకు చేరుతుండడంతో కొంతమంది లబ్ధి పొందిన వారు కూడా ప్రభుత్వపై విమర్శలు చేస్తున్నారని ఇదీ కార్యకర్తలకు ఇబ్బందిగా మారుతుందన్నారు. ఇవన్నీ గుర్తించి కార్యకర్తలకు గుర్తింపు వచ్చే విధంగా రాబోవు రోజుల్లో చర్యలు తీసుకుంటామన్నారు. మన ప్రభుత్వం ఉంటేనే మనకు గుర్తింపని...ప్రజలకు ఉపయోగమని కూర్చున్న కొమ్మను నరుక్కున విధంగా పని చేయవద్దన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలకు దగ్గరకు తీసి కలుపుకుని పోవాలని ఎవరినీ తక్కువచేసి చూడొద్దన్నారు. స్థానిక నాయకులతో ఏమైన ఇబ్బందులుంటే నాకు చెప్పాలన్నారు. నేను మీ మనిషిని కానా..నన్ను మీ సొంత మనిషి అనుకుని మీ కష్టసుఖాలు నాతో పంచుకుని పార్టీ కోసం పని చేసి చంటి లోకల్...స్థానిక ముద్దుబిడ్డను గెలిపించాలన్నారు. ఇదే సమయంలో రేగోడ్‌ను సంగారెడ్డి జిల్లాలో కలపాలని కార్యకర్తలు కోరగా...రేగోడ్ నుంచి భారీమెజార్టీతో ఎమ్మెల్యేను గెలిపించండి... సీఎం కేసీఆర్‌తో మాట్లాడి రేగోడ్‌ను సంగారెడ్డి జిల్లాలో కలిపిస్తానన్నారు. దీంతో అల్లాదుర్గం, రేగోడ్ మండలాల వారు సైతం తమ మండలాలు కూడా సంగారెడ్డిలో కలపాలని కోరగా...తప్పకుండా సీఎంతో మాట్లాడుతానని మీరు మాత్రం ఎమ్మెల్యేను అధిక మెజార్టీతో గెలిపించేందుకు కష్టపడి పనిచేయాలన్నారు.

## కులవృత్తులకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట

**పటాన్‌చెరు అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి**

అమీన్‌పూర్, నవంబర్ 7: గత ప్రభుత్వాల హయాంలో కులవృత్తులు నిర్వీర్యమయ్యాయని, కేసీఆర్ పాలన వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ కులవృత్తులకు జీవంపోశారని పటాన్‌చెరు ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనాన్ని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో అమీన్‌పూర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎవరూ ఊహించనిరీతిలో అన్ని కులాలకు పెద్దపీట వేసి వారి అభివృద్ధి కృషి చేశారని పేర్కొన్నారు. నాయీబ్రాహ్మణులు ఈ నెల 30న జరుగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నందారం నర్సింహగౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చౌటకూరి బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు, ఆర్‌సీపురం మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, సీనియర్ నాయకులు తుమ్మల ప్రతాప్ రెడ్డి, మాదవరెడ్డి, కార్యకర్తలు నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అమీన్‌పూర్ నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి

## కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

**ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**


బూరుగుపల్లిలో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబర్ 7: సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, అర్హులైన పేదలకు న్యాయం జరగాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బూరుగుపల్లి, దాచారం, అనంతరావుపల్లి, పిడిచేడ్, బెజుగామ, ర్యాగట్లపల్లి, బయ్యారం గ్రామాల్లో బీఆర్ఎస్ రోడ్‌షో నిర్వహించారు. బూరుగుపల్లిలో మహిళల బోనాలు, మత్స్యకారుల విన్యాసాలు, డప్పుచప్పుళ్లతో ఒగ్గు కళాకారుల నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పేదల సంక్షేమానికి దోహదపడుతున్నదన్నారు. కార్యక్రమంలో ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ మల్లేశం, ఫ్యాక్స్ చైర్మన్ వెంకటేశంగౌడ్, సర్పంచ్ విజయవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధు, వైస్ ఎంపీపీ కృష్ణ, రవీందర్‌రావు, చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎల్లయ్య, రఘుపతిరెడ్డి, రమేశ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.